మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



మగ్గంపై పట్టుచీర నేస్తున్న పద్మశాలీలు

గోల్కొండ: పద్మశాలీ సంఘం వారు ప్రత్యేకంగా తయారు చేసిన పట్టు చీరను జగదాంబిక మహంకాళి అమ్మవారికి బుధవారం సమర్పించారు. అమ్మవారి ఆశీర్వాదం పొందేందుకు ఏటా ఆలయ ప్రాంగణంలోనే పట్టు చీర తయారు చేసి సమర్పిస్తున్నామని సంఘానికి చెందిన జయరాజ్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో వృత్తి పనివారి సంఘం అధ్యక్షుడు పీ శివశంకర్, వెంకటేశం, చెన్న ఉపేందర్ తదితరులు ఉన్నారు.

కరుణాకర్ నిస్వార్థ నాయకుడు



కరుణాకర్ కుటుంబ సభ్యులతో బండారు దత్తాత్రేయ

గోల్కొండ: బీజేపీ సీనియర్ నాయకుడు గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ నిస్వార్థ ప్రజా నాయకుడని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గుడిమల్కాపూర్ గాయత్రీనగర్‌లోని కరుణాకర్ నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణాకర్‌తో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందని నిబద్ధతతో పార్టీ కోసం పని చేసిన నాయకుడని కొనియాడారు. అనంతరం కరుణాకర్ కుమారుడు వంశీకి తాను రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పుస్తకాన్ని బహుకరించారు.

మహంకాళి అమ్మవారికి పూజలు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి ఆషాఢమాసం బోనాల పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బంజారి దర్వాజా, మక్కై దర్వాజా, ఫతే దర్వాజాల రహదారుల గుండా తొట్టెల ఊరేగింపుతో భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కే శేఖర్‌రెడ్డి, శేఖర్‌యాదవ్ తదితరులు కూడా పూజలు చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని నియోజకవర్గ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ బద్దం సతీశ్ గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ సెల్ జాయింట్ కన్వీనర్ నిర్మల్‌కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు నాంపల్లి తహసీల్దార్ నయిముద్దీన్‌కు బుధవారం మెమోరాండం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. దాదాపు 100 మంది నిరుపేద కుటుంబాలను గుర్తించి జాబితా అందించానన్నారు. కార్యక్రమంలో వంజరి శ్రీనివాస్, రాధాకృష్ణ, కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సంతోష్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో సిబ్బందితో కలిసి బుధవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్‌ను చేపట్టామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు.

ఘనంగా బాల గంగాధర్ తిలక్ జయంతి

అఫ్జల్‌గంజ్: బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి రావినూతల శశిధర్, ఇతర నాయకులు శ్రీరామ్ వ్యాస్, గోవింద్‌రాఠి, ఉమా మహేందర్ బేగంబజార్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ.. స్వరాజ్యమే నా జన్మహక్కు అంటూ చాటిచెప్పిన మహనీయుడు బాలగంగాధర్ తిలక్ అని అన్నారు. వినాయక ప్రతిమలను నెలకొల్పి ప్రజలతో పూజలు చేయించి హిందూ భక్తి భావాలను పెంపొందించిన నాయకుడు బాలగంగాధర్ తిలక్ అని కొనియాడారు.

వర్షం వస్తే వణుకే..!

- డబీర్‌పురా దర్వాజ–డబీర్‌పురా ఫ్లై ఓవర్ రోడ్డంతా జలమయం
- వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం





దబీర్‌పురాలో చెరువును తలపిస్తున్న ప్రధాన రోడ్డు (ఫైల్)

చార్మినార్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో డబీర్‌పురాలోని ప్రధాన రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డబీర్‌పురా దర్వాజ నుంచి డబీర్‌పురా ఫ్లై ఓవర్ రోడ్డుపై వరద నిలిచిపోతుండడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ఈ రోడ్డుకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేదు. ఎందుకంటే రైల్వే ట్రాక్ ఉండడంతో డబీర్‌పురా ఫ్లై ఓవర్ మీదు నుంచే రాకపోకలు సాగించాలి. దీంతో ఈ రోడ్డు చాలా బిజీగా ఉంటుంది.

ఎప్పుడు వర్షాలు కురిసినా..

మీరాలంమండి, చత్తాబజార్, మదీనా, పురానాపూల్, హైకోర్టు, నయాపూల్, పురానీహవేలీ, నూర్‌ఖాన్ బజార్ తదితతర ప్రాంతాల నుంచి చంచల్‌గూడ, సైదాబాద్, కుర్మగూడ, సంతోష్‌నగర్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు డబీర్‌పురా దర్వాజ–ఫ్లైఓవర్ ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. వర్షాలు కురిసినప్పుడల్లా వరద నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి.

రాత్రే ఇబ్బందులు..

పగటిపూట ఎలాగో తమ వాహనాలతో వెళ్తున్నవారు.. రాత్రి సమయంలో మాత్రం ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్లపై ఎక్కడ గోతులున్నాయో తెలియకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వరదను ఎప్పటికప్పుడు తొలగించే యంత్రాంగం అందుబాటులో లేకపోవడంతో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నిలిచిన వరద సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎక్సైజ్ ఆఫీస్ సూపరింటెండెంట్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి



నివాళులర్పిస్తున్న సిబ్బంది

అబిడ్స్: ఎక్సైజ్ శాఖలో 36 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ ధర్మారెడ్డి శైలజ బ్రెయిన్ స్ట్రోక్‌తో హఠాన్మరణం చెందారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండ్‌గా నాంపల్లిలోని హెడ్‌ఆఫీసులో పనిచేసి.. ఈ మధ్యనే ఎక్సైజ్ అకాడమీకి బదిలీ అయ్యారు. శైలజకు ఇంటి వద్దనే మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బుధవారం అబ్కారీ భవన్ ప్రధాన కార్యాలయంలో సహచర ఉద్యోగులు శైలజ మృతిపట్ల సంతాపం తెలిపి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మీనాక్షి నటరాజన్‌తో సమావేశమైన మమతా గుప్తా, సంతోష్ గుప్తా

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను బుధవారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మమతా గుప్తా, సంతోష్ గుప్తా కలిశారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు ఉత్కర్ష్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా అందరూ కృషి చేయాలని కోరినట్లు మమతా గుప్తా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన

సుల్తాన్‌బజార్: ఆర్‌బీఎస్‌కే అద్దె వాహనాల ఆరు నెలల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మొబైల్ హెల్త్ టీమ్ వెహికిల్స్ ఓనర్లు, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలయ్య గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కోఠిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ఆర్‌బీఎస్‌కే అద్దె వాహనాల ఓనర్లు, డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలయ్య గౌడ్ మాట్లాడుతూ..గత ఆరు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక, వాహనాలకు డీజిల్ పోయించడం కష్టంగా మారిందన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే బిల్లులు చెల్లించకుంటే ఆగస్టు 1వ తేదీ నుంచి వాహనాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జగన్, ట్రెజరర్ స్వామి గౌడ్, పెద్దఎత్తున ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్, వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికి సన్మానం



సుల్తాన్‌బజార్: తెలంగాణ ఎన్జీఓస్, వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా దేవదాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎం ప్యాలెస్ కోఠిలోని మాల సంఘాలు, మాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గౌరవ అధ్యక్షుడు చెరుకు రాంచందర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌తో పాటు తాండూర్, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లోని మాల సంఘాల జేఏసీ, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని దేవదాసును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఉపాధ్యాయులు మంచనపల్లి శ్రీనివాస్, నర్సింహులు, హన్మప్ప, అడ్వొకేట్ అబ్రహం, ఈశ్వర్, సురేశ్, తాండూర్ నియోజకవర్గం నుంచి కష్ణకుమార్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కళలను నవతరానికి పరిచయం చేయాలి



సినీ నటి రాగిణిని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో తెలంగాణ బోనాల జాతరను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని అన్నారు. కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ మన సంస్కృతి, సాంప్రదాయాలను నవతరానికి పరిచయం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం వివిధ అంశాలపై చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను సన్మానించారు. కార్యక్రమంలో సినీ నటి రాగిని, సంస్థ వ్యవస్థాపకుడు లయన్ కేవీ. రమణాచారి, లలిత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజనీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బుధవారం అన్నదాత అనే నాటకాన్ని ప్రదర్శించారు. ప్రస్తుత సమాజంలో 'రైతాంగం మనుగడ ప్రశ్నార్థకం కావడం.. ఈ దుస్థితికి కారకులెవ్వరు' అనే అంశంపై సాగిన ఈ నాటకం సభికులను ఆలోచింప జేసింది. ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, సమాజంలో రైతులపై చిన్న చూపు వంటి అంశాలు ప్రేక్షకులను ఉద్వేగానికి గురిచేశాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నాటకరంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాటకాన్ని వీ శివప్రసాద్ రచించగా కే రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో రసరంజనీ కార్యవర్గ సభ్యులు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

నేడు పురస్కారం ప్రదానం

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ల సంయుక్తాధ్వర్యంలో ఈనెల 24న (నేడు) సినారే జయంతిని పురస్కరించుకుని సినీ నటి రాజశ్రీకి సినారే సాహిత్య నటన పురస్కారాన్ని రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ. రమణాచారితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆమె పేర్కొన్నారు. నన్ను దోచుకుందువటే శీర్షికన ప్రముఖ గాయనీ గాయకులతో సినారే గీతాలతో సీల్‌వెల్ సినీ సుస్వరాలు ఉంటాయని తెలిపారు.

అసిస్టెంట్ సబ్ పోస్టాఫీసర్‌పై చీటింగ్ కేసు

లంగర్‌హౌస్: డబ్బులు కాజేసిన ఓ అసిస్టెంట్ సబ్ పోస్టాఫీసర్‌పై చీటింగ్ కేసు నమోదు అయిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలో నివాసముండే ఆనంద్‌కుమార్ లంగర్‌హౌస్‌లోని పోస్టాఫీస్ కార్యాలయంలో అసిస్టెంట్ సబ్ పోస్ట్ అధికారిగా ఏడాది క్రితం విధుల్లో చేరాడు. ఆఫీసులో రూ. 9 లక్షల డిపాజిట్లు ఉండగా అందులో రూ. 7 లక్షలు కాజేశాడు. రూ. 2 లక్షలు మాత్రమే నగదు ఉందని తెలుసుకున్న తంతి తపాలా పశ్చిమ మండల అధికారి శ్రీనివాస్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌పై లంగర్‌హౌస్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆనంద్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు.

చర్చనీయాంశంగా లాల్‌దర్వాజా ఆలయ హుండీ వ్యవహారం

ఇకపై హుండీలు పెట్టమని కమిటీ ప్రకటన



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం హుండీ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమయ్యింది. మూడేళ్ల క్రితం హుండీ లెక్కింపు వ్యవహారంలో కమిటీ సభ్యుల మధ్య నెలకొన్న వివాదం వివాదాస్పదమయ్యింది. తాజాగా బుధవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు 5 హుండీలు లెక్కించేందుకు రాగా, ఒక్కరోజు ముందే ఆలయ కమిటీ ప్రతినిధులు 3 హుండీలు లెక్కించినట్లు తెలిసింది. డిప్యూటీ కమిషనర్ కే వినోద్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అంజనారెడ్డి ఆధ్వర్యంలో మిగిలిన 2 హుండీలు లెక్కించగా, రూ.51,271లుగా తేలింది. ఈ డబ్బులను దేవాదాయ శాఖ అకౌంట్‌లో జమ చేయనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెరిచిన 3 హుండీల్లోని రూ.4.13 లక్షలను ఆలయ అవసరాలకు వినియోగించినట్లు చైర్మన్ మారుతీ యాదవ్ తెలిపారు. హుండీల వ్యవహారం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఇకపై ఆలయంలో హుండీలు పెట్టమని ఆలయ కమిటీ పేర్కొనడం గమనార్హం. హుండీ ఆదాయం లేకుంటే దేవాదాయ శాఖ అధికారుల పెత్తనం లేకుండా ఉంటుందన్నారు.

ఆలయ ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ మృతి



గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేశం గౌడ్, కే జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈ సుమన్ కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మామిడి కృష్ణ, బీవై.శ్రీకాంత్, ఎం.ప్రకాశ్, పీ ప్రకాశ్, మాణిక్ రావు, కోశాధికారి బొడ్డు సాయిబాబా, రాము గౌడ్, చందు, కే శ్రీకాంత్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం బృందం

నాంపల్లి: సైబర్ క్రైం బృందం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించింది. డిజిటల్ అరెస్ట్‌తో మోసాలు, నకిలీ పీఎం కిసాన్ యోజన, లోన్ యాప్ వంటి ఏపీకే ఫైల్స్, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు సంబంధించిన అనుకరణ, మీషో మోసాలు, ఓటీపీ, బ్యాంక్ రివార్డ్ పాయింట్ స్కామ్స్, పెట్టుబడి, ట్రేడింగ్, నకిలీ లోన్ యాప్‌లు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై స్టేషన్ సిబ్బందికి వివరించారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ దర్యాప్తును నమ్మవద్దని, తెలియని ఫోన్ కాల్స్ ఎత్తవద్దని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, గుర్తు తెలియని వ్యక్తులకు డెబిట్, క్రెడిట్ కార్డు ఓటీపీ వివరాలు వెల్లడించవద్దని సూచించారు. సైబర్ నేరాల మోసానికి గురైన బాధితులు వెంటనే డయల్ 1930 కు ఫిర్యాదు చేయాలని లేదా అత్యవసర సమయాల్లో 8712665171కు కాల్ చేయాలని కోరారు.

ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఫిజియోథెరపీ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి మరిన్ని స్పెషలిస్టు వైద్య పోస్టులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రితో పాటు వైద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించానన్నారు. ఆసుపత్రి నూతన బ్లాక్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయని అయితే సాంకేతిక కారణాల వల్ల పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. దివ్యాంగుల కోసం ఆసుపత్రిలో ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేసే ప్రత్యేక విభాగాన్ని, క్యాంటీన్‌ను మరింత ఆధునీకరిస్తామన్నారు. వైద్యులు, ఇతర సేవలను సూపరిండెంటెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యశ్రీ, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే బోనాలు విజయవంతం



ఛత్రినాక ఏసీపీని సన్మానిస్తున్న రాజ్ నారాయణ ముదిరాజ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ప్రజలందరి సహకారంతోనే బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఛత్రనాక ఏసీపీ కార్యాలయంలో ఏసీపీతో పాటు డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు బుధవారం పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఛత్రినాక, శాలిబండ, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్లు కేఎస్.ప్రసాద్ వర్మ, మహేశ్ గౌడ్, శ్రీను, కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాజ్ నారాయణ ముదిరాజ్, కౌన్సిల్ కో–ఆర్డినేటర్ జీ వేణుగోపాల్, పాతబస్తీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆరె కటిక సంఘం నాయకుడు సూర్యతో పాటు విజయ్ పోతరాజు, పవన్ రెడ్డి, పట్నం రాజేశ్, పొట్టేలు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మీరాలంమండి అమ్మవారి బోనాలు



మారు బోనంతో గాజుల అంజయ్య కుటుంబ సభ్యులు



అంజయ్యకు మెమెంటో ఇస్తున్న కమిటీ చైర్మన్ రాఘవేందర్ తదితరులు

చార్మినార్: మీరాలంమండిలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో కద్దాల్ మైసిగండి మైసమ్మ తల్లికి బుధవారం మారు బోనం సమర్పించారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్‌తో పాటు పలు ఆలయాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని గాజుల అంజయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య బోనాల పండుగకు సహకరించిన ప్రభుత్వ అధికారులు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు రాకేశ్ తివారి, పాటిల్ సదానంద్ యాదవ్, జనగామ మధుసూదన్ గౌడ్‌తో పాటు ఆలయాల కమిటీ ప్రతినిధులు మల్యాల మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్, రాయికోటి బాబురాజు, శ్రీధర్ యాదవ్, గాజుల రాహుల్ (గబ్బర్), కాట రమేశ్, ప్రముఖ బిల్డర్ కోటిరెడ్డి, కేఎస్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ



నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, ప్రతినిధులు

గౌలిపురా: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా సంయుక్తాధ్వర్యంలో అయోధ్యనగర్‌లోని శాలిబండ బాలుర హైస్కూల్, అయోధ్యనగర్ ప్రైమరీ స్కూల్‌లో 170 మంది విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు కాశెట్టి పాండు గుప్తా, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా, వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు దేవత శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. లాల్‌దర్వాజా సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ కోటయ్య అధ్యక్షతన వహించారు. నోట్ బుక్స్ ఇరుకుల్ల నరసింహులు, స్టేషనరీ వాసవీ క్లబ్ హైదరాబాద్ సౌజన్యంతో అందించారు. కార్యక్రమంలో లాల్‌దర్వాజా గౌలిపురా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఐపీపీ శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ఇరుకల్ల నరసింహులు, సంఘం ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అడ్మిన్ ఇరుకుల భిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్క శేఖర్, పీఆర్ఓ సరాబు ఉదయ్ భాస్కర్, ఉపాధ్యక్షుడు బెజుగం చంద్రమోహన్, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



యాకుత్‌పురా: ప్రభుత్వ చార్మినార్ యూనాని ఆసుపత్రి, నిజామియా టీబ్బి కళాశాల, ఉద్యోగులు, టీజీఓ, ఆయూష్ ఫోరంల సంయుక్తాధ్వర్యంలో బుధవారం బోనాలు నిర్వహించారు. మహిళా వైద్యాధికారులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, అసోసియేట్ అధ్యక్షుడు బీ శ్యామ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, నగరా అధ్యక్షుడు జీ వెంకట్, ఉపాధ్యక్షుడు బీ శ్రవణ్ గౌడ్, వైద్యాధికారులు డాక్టర్లు రామారావు, శ్రీరామ్ రెడ్డి, ఆయూష్ విభాగం నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభాకర్, డాక్టర్ సునీత జోషి, డాక్టర్లు నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.